క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పెడన: రాష్ట్ర స్థాయి పోటీలకు తమ విద్యార్థినులు ఎంపికయ్యారని పెడన మండలం బల్లిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ గురువారం తెలిపారు. ఈ నెల 4వ తేదీన విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగం బాలికల వాలీబాల్, త్రోబాల్ పోటీలు జరిగాయి. వాలీబాల్‌లో ఇంటర్ విద్యార్థినులు పీఎస్‌వీటీ ప్రియ, కె. అనుష్క, త్రోబాల్‌లో కె. బిందు, ఎం. ప్రవల్లిక, కె. అనుష్క, పీఎస్‌టీ ప్రియ రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సాధించారని చెప్పారు. విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయినులను పి. మాధవి, టి. ప్రశాంతిని అభినందించారు.

ప్రారంభానికి సిద్ధమైన పీఏసీఎస్ భవనం



ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఉత్తర చిరువోలులంకలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి బ్యాంక్ భవనాన్ని ఈ నెలాఖరులో ప్రారంభిస్తామని పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్రౌతు వెంకట రమణ తెలిపారు. జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ అందించిన రూ. 21.60 లక్షలతో నూతన భవనం నిర్మించామని తెలిపారు. భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

98.98 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో గురువారం నాటికి వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ 98.98 శాతం పూర్తి చేశారు. నగరంలో 19,123 పింఛన్లు ఉండగా 18,928 పింఛన్లను పంపిణీ చేశారు. ఇంకా 195 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉంది.

మెరుగైన సేవలు అందించాలి



గూడూరు: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి వి.పార్వతి అన్నారు. గూడూరు మండలం లేళ్లగరువు సచివాలయం, ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి పాఠశాలలో జగనన్న గోరుముద్ద ఆహారాన్ని రుచి చూశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయప్రసాద్, పాఠశాల హెచ్ఎం బి.అనురాధ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గూడూరు: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమం అమలు చేస్తోందని రాయవరం సర్పంచి నందం మల్లీశ్వరి రవికిరణ్ అన్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా తడి చెత్త, పొడి చెత్త సేకరణకు బుట్టల పంపిణీ కార్యక్రమం గురువారం ఎస్సీ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ పంచాయతీకి 1230 చెత్తబుట్టలు వచ్చాయన్నారు. ప్రతి ఇంటికీ రెండు బుట్టల చొప్పున పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్క ఇంటి నుంచి గ్రీన్ అంబాసిడర్లు ప్రతి రోజూ చెత్త సేకరణ చేస్తారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నసమారాధన

గుడివాడటౌన్: స్థానిక 31వ వార్డులో నిర్వహించిన గణపతి నవరాత్రి మహోత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నవరాత్రి మహోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వంగలపూడి కనకబాబు, వీరిశెట్టి నరసింహారావు, శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాంబాబు, పంచకర్ల వెంకట్, పి.బాలు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆధునిక వైద్యం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- సురక్ష శిబిరాలకు విశేష స్పందన
- రోగులకు వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



పెదప్రోలులో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

పెదప్రోలు(మోపిదేవి): ప్రజలందరికీ ఆధునిక వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి మండలం పెదప్రోలు జెడ్పీ పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో ఆస్పత్రుల్లో సరైన మందులు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడేవారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించారని చెప్పారు. అత్యాధునిక పరికరాలను సమకూర్చడంతోపాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. పలు పథకాల ద్వారా పేదలకు వైద్యాన్ని చేరువ చేశారని వివరించారు. దూరప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లలేని పేద ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు గ్రామంలోనే 105 రకాల మందులతో వైద్య సేవలు అందించి నెలకు సరిపడా ఉచితంగా మందులు ఇస్తున్నారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి ఆహారాన్ని రుచి చూశారు. సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు, గరికిపాటి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, వైద్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డలోని ఎంపీపీ యూపీ స్కూల్‌లో జరిగిన శిబిరంలో 487 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.

కార్పొరేట్ వైద్యం చేరువ..

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాల ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశారని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. గురువారం బల్లిపర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 365 మంది ఓపీలో నమోదు చేయించుకోగా 102 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి సిఫార్సు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అచ్యుతరావు, పామర్తి బెనర్జీ, వైద్యులు సోదేష్ బాబు, అఖిలాండేశ్వరి, ప్రదీప్‌కుమార్, మీనాదేవి, కంటి వైద్యులు ఇబ్రహీం పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

మచిలీపట్నంటౌన్: పేద ప్రజలకు విద్య, వైద్యం మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. చిలకలపూడి పాండురంగ హైస్కూల్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మేయర్ వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభించి పేర్ని కిట్టు మాట్లాడారు. శిబిరానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత థామస్‌నోబుల్, లంకా సూరిబాబు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

● చల్లపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి అన్నారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం-4 పరిధిలోని పడమరవైపు ఇస్లాం నగర్‌లో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 475 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి శివప్రసాద్, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, ఎంపీడీఓ చేకు చినరాట్నాలు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), సీహెచ్‌సీ డైరెక్టర్ అబ్దుల్ కరీం, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్ పాల్గొన్నారు.

● కృత్తివెన్ను: మండల పరిధి చెరుకుమిల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ ప్రారంభించి మాట్లాడారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో 313 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులతో పాటు ఎంపీపీ గరుడప్రసాద్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పి. మహేష్, దేవస్థానం చైర్మన్ నాగేశ్వరరావు, నాయకులు పట్టపు నాని, నాగశ్రీను, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

627 మందికి పరీక్షలు..

బంటుమిల్లి: మండల పరిధిలోని ఆముదాలపల్లి పంచాయతీ శివారు జయపురం అప్పర్ ప్రైమరీ పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 627 మందికి వైద్య పరీక్షలు, 365 మందికి పలు రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. ఐదుగురిని మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి సిఫార్సు చేశారు. మిగిలిన వారికి మందులు అందజేశారు. శిబిరాన్ని ఎంపీపీ వి. చినబాబు రాష్ట్ర మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైద్య నిపుణులతో ప్రజల ఇంటి వద్ద వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య నిపుణులు అనురుధ్, అచ్యుత్, కె. పవన్‌కుమార్, సీహెచ్ జయశ్రీ, కె. సువర్చల, వి. జయశ్రీ, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

లేళ్లగరువులో..

గూడూరు: గూడూరు మండలం లేళ్లగరువు సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ శిబిరాన్ని ప్రారంభించారు. సచివాలయం పరిధిలోని లేళ్లగరువు, జక్కంచర్ల, గురిజేపల్లి, కలపటం గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



చిలకలపూడిలో రోగికి ఈసీజీ తీస్తున్న వైద్యులు



చెరుకుమిల్లిలో పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న జోగి రాజీవ్

సాలెంపాలెంలో 405 మందికి వైద్య పరీక్షలు..

కోడూరు: మండలంలోని సాలెంపాలెం గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. 405 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, జనరల్, ఆర్థోపెడిక్ వైద్యులు శైలేంద్ర, అవినాష్‌లు వైద్య సేవలు అందించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, మండల కన్వీనర్ పరిశె మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● కోనేరుసెంటర్: మండల పరిధిలోని గుండుపాలెంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, బందరు ఎంపీడీఓ బాలకృష్ణారావు, బందరు తహసీల్దార్ శ్రీవిద్య, వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రాంగణం సుందరీకరణకు ప్రణాళిక

కలెక్టర్ రాజాబాబు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నంటౌన్: కలెక్టర్ కార్యాలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఆర్వో పి. వెంకటరమణతో కలిసి పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన ఈ అంశంపై సమీక్షించారు. కలెక్టరేట్‌లోకి అడుగుపెడితే ప్రజలకు మంచి భావన కలిగేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. వర్షం పడితే పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి ఇబ్బందికరంగా ఉంటోందని, ఆయా ప్రాంతాల్లో వర్షం నీరు నిలవకుండా మట్టితో పూడ్చాలన్నారు. కలెక్టరేట్‌లో కురిసే వర్షం నీరు సరైన మార్గంలో ప్రవహించి బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రతి కార్యాలయానికి వెళ్లేందుకు సరైన అంతర్గత రహదారులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రహరీ పటిష్టంగా ఉండాలని చెప్పారు. ప్రధాన ప్రవేశమార్గం వద్ద హోంగార్డును నియమించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్ సుందరీకరణలో భాగంగా పచ్చనితోట, ప్రజలు కూర్చునేందుకు సౌకర్యంగా బల్లలు, పార్కింగ్ ప్రదేశాలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలో నూతన కాన్ఫరెన్స్ హాల్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి కలెక్టరేట్ అభివృద్ధిపై సమీక్షిస్తానని చెప్పారు. ఆర్అండ్‌బీ అతిథిగృహాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. కలెక్టరేట్ మార్గంలో ఉన్న శిథిలమైన బాలభవన్ భవనాన్ని తొలగించాలన్నారు. సమావేశంలో డీపీఓ నాగేశ్వర నాయక్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఎంయూడీఏ వీసీ రాజ్యలక్ష్మి, ఉద్యాన అధికారి జ్యోతి, డీటీసీ సీతాపతిరావు, ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు, కమిషనర్ జి. చంద్రయ్య పాల్గొన్నారు.

అధిక పాల ఉత్పత్తికి కృషి చేయాలి

పెరిశేపల్లి(పామర్రు): పాడి రైతులు పాల ఉత్పత్తి పెంపుదలకు కృషి చేయాలని విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. జుఝవరం, పెరిశేపల్లి గ్రామాల్లోని పాల సేకరణ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అధిక పాల దిగుబడికి తీసుకోవలసి చర్యలు, సబ్సిడీలపై అందజేసే దాణా తదితరాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, జిల్లా ట్రస్టు బోర్డు సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చెరుకూరి కృష్ణమోహన్, దామోదర కృష్ణ గోపీచంద్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్



అచ్చయ్యవారిపాలెంలో పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

- మంత్రి జోగి రమేష్
- నందమూరు - అచ్చయ్యవారిపాలెం రోడ్డు పనులకు శంకుస్థాపన
- రూ.20 లక్షలతో అచ్చయ్యవారిపాలెంలో తాగునీటి కుళాయిల ఏర్పాటు

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవతోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నకు మనమంతా అండగా ఉండాలన్నారు. మండల పరిధి అచ్చయ్యవారిపాలెం, గొడపాలెం గ్రామాలలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని, అది చూసి ఓర్వలేని ప్రతిపక్షాల నాయకులు విమర్శలు చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాలు వేసిన రోడ్లు నాణ్యతా ప్రమాణాలు సరిగా లేకపోవడంతో త్వరితగతిన గోతులు.. గుంటలు పడ్డాయని, నాడు వారు చేసిన తప్పిదాలు తమ ప్రభుత్వంపై మోపడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ, నవరత్నాల పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని వివరించారు.

రూ. 2 కోట్లతో రోడ్డు నిర్మాణం

నందమూరు నుంచి జింజేరు మీదుగా అచ్చయ్యవారిపాలెం వరకు రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి జోగి రమేష్ శంకుస్థాపన చేశారు. అలాగే అచ్చయ్యవారిపాలెంలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.20 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు, పైప్‌లైన్ నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో పెడన ఏఎంసీ చైర్‌పర్సన్ చారుమతి, పెడన ఎంపీపీ వాణి, మండల కన్వీనర్ నాగబాబు, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, వెంకటరామానాయుడు, సర్పంచ్‌లు నరసింహారావు, సత్యనారాయణ, నరసింహస్వామి, భైరవలింగం, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు ప్రశంసనీయం



మొక్క నాటిన పాలకుర్తి గాయత్రి

చల్లపల్లి: వాసవీ క్లబ్ చల్లపల్లి శాఖ సేవలు ప్రశంసనీయమని క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి అన్నారు. గురువారం చల్లపల్లిలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అఫీషియల్ విజిట్ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో క్లబ్ కార్యాలయంలో పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో అమ్మకు గౌరవం పేరుతో తల్లులు తమ బిడ్డలకు పాలు పట్టేందుకు క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గదిని, షాదీఖానా పక్కన రామాలయంలో క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన నీటి వసతిని ప్రారంభించారు. ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ రామచంద్రరావు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా నా మట్టి - నా దేశం కలశ ప్రదర్శన

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం (విజయవాడ) ఆధ్వర్యంలో నా మట్టి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు తీసుకొచ్చిన మట్టిని కలశంలో కలిపారు. అనంతరం మట్టి కలశంతో హైస్కూల్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్ఎం ఝాన్సీ, ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాజేష్, యువ కేంద్రం సభ్యులు భీమాల వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణకు చర్యలు చేపట్టాలి

ఉంగుటూరు: వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా మోతాదు ప్రకారం కలుపు నివారణ చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఐఆర్ఆర్ (ఇండియన్ రైస్ రీసెర్చ్) శాస్త్రవేత్త శ్రీదేవి అన్నారు. మండలంలోని ఆత్కూరు, పొణుకుమాడు వరి పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగులో కలుపు అధికంగా ఉండటాన్ని గుర్తించామని చెప్పారు. రైతులు కలుపు నివారణకు ఏ రసాయన మందులు వాడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. కలుపు నివారణకు అధిక మోతాదులో రసాయన మందులు వినియోగిస్తే నేల సారం కోల్పోవడంతో పాటు వ్యయం పెరుగుతుందని పేర్కొన్నారు. సరైన సమయంలో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో హరీష్‌కుమార్, ఏఈవో దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.





గురువులకు ఘన సన్మానం

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 60 మంది ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. -అవనిగడ్డ

విద్యతోనే పేదరిక నిర్మూలన

గుడ్లవల్లేరు: గురువు అందించే విద్యతోనే సమాజంలో పేదరిక నిర్మూలన జరుగుతుందని అంగలూరు ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డైట్‌లో 16 మంది అధ్యాపకులను ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ వారు సన్మానించారు. వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షుడు లోయ వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు అర్జా ప్రసాద్, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారి చింతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లంకమ్మ హుండీ ఆదాయం రూ.7.88 లక్షలు



అవనిగడ్డ: లంకమ్మ అమ్మవారి హుండీ కానుకలను గురువారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఐదు నెలల 25 రోజుల కాలానికి సంబంధించి హుండీ కానుకలను లెక్కించగా, రూ.7,88,910 వచ్చాయని ఆలయ కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్ తెలిపారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ పి. సీతారామయ్య, దేవదాయ శాఖాధికారులు, సిబ్బంది, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

నాగాయితిప్ప(మోపిదేవి): గ్రామాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) అన్నారు. నాగాయితిప్ప, కోసూరువారిపాలెం పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను అధికారులు వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేయనున్న పనుల ఆమోదం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులను వివరించారు. అనంతరం మేట్లు, కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కోసూరు అనూష, గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవింద రాజులు, ఏపీఓ రవికుమార్, టీఏ హరిబాబు నాయక్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ లింగం జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



మచిలీపట్నంటౌన్: 11వ డివిజన్‌కు చెందిన వేముల కనకదుర్గ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ విజయవాడ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. డివిజన్ అడ్మిన్ సాయికిరణ్ విజయవాడ ఆస్పత్రికి వెళ్లి కనకదుర్గకు పింఛను సొమ్మును అందజేశాడు. లబ్ధిదారు కృతజ్ఞతలు తెలిపింది.